క్లుప్తంగా

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



ద్వారపూడి లారీ యూనియన్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం (మండపేట): రవాణారంగ కార్మికులు తీసుకునే వ్యక్తిగత జాగ్రత్తలు సామాజిక ప్రగతికి దోహదం చేస్తుందని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అన్నారు. ద్వారపూడి లారీ యూనియన్ కార్యాలయం వద్ద డ్రైవర్లకు రహదారి భద్రత నియమాల ప్రాధాన్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, సహాయకులు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహనతో మెలగాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

సామూహిక సీమంతం



కోటిపల్లిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న నిర్వాహకులు

కె.గంగవరం: కోటిపల్లిలో శుక్రవారం భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా 18 మంది గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. వారికి పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, గాజులు అందజేశారు. సత్యసాయిబాబా చిత్రపటంతో పల్లకిలో గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆర్ నారాయణరావు, ఎం.నరసింహారావు, భక్తులు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టులో విద్యుద్దీపాల ఏర్పాటు



మండపేట ధోబీఘాట్ వద్ద విద్యుద్దీపాల వెలుగులో ఫుడ్ కోర్టు

కపిలేశ్వరపురం (మండపేట): బస్టాండ్ సమీపంలోని ధోబీఘాట్ వద్ద ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసుకునేందుకు విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. కమిషనర్ టీవీ రంగారావు ప్రత్యక్ష పర్యవేక్షణతో తగిన సదుపాయాలు కల్పించారు. వీధుల్లో ఆహార పదార్థాలు విక్రయించుకునే చిరు వ్యాపారాలు ధోబీఘాట్ వద్ద విద్యుత్ వెలుతురులో ఆహార పదార్థాలను విక్రయించుకోవచ్చన్నారు. ఆరోగ్యపరమైన నియమ నిబంధనలను పాటిస్తూ చిరు వ్యాపారాలు ఆహార పదార్థాలను విక్రయించుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

నేమ్ బోర్డుల అవినీతి ఆరోపణలపై విచారణ

కపిలేశ్వరపురం: 2019–2022 మధ్య కాలంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి నేమ్ బోర్డులు ఏర్పాటులో అవినీతి జరిగిందంటూ అందిన ఫిర్యాదుపై గురువారం జిల్లా అంబుడ్స్‌మెంట్ అధికారి ఏవీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సంబంధిత వివరాలు సేకరించారు. ఏర్పాటు చేయకుండా 305 నేమ్ బోర్డులకు సొమ్ము తీసుకుని అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణపై విచారణ చేస్తున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయ్యాక ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

రాయవరం: మండలంలోని పసలపూడి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్టు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. నిందితుల వద్ద వద్ద నుంచి పేక ముక్కలు, రూ.11,400 నగదు, టేబుల్, ఆరు కుర్చీలు స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న బియ్యం, పంచదార, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రేషన్ షాపులకు సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బి.చిన బాబు, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వోలు పీవీ రమణ, డి.వెంకటేశ్వరరావు, ఐవీవీ రమేష్ ఆర్డీవో వెంట ఉన్నారు.

రెవెన్యూ అంశాలపై శిక్షణ

కపిలేశ్వరపురం: ఓన్ రీసోర్స్ రెవెన్యూపై గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతి నిర్వహించారు. ఎంపీడీఓ హెచ్. భానూజీరావు పర్యవేక్షణలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెవెన్యూ అంశాలపై శిక్షకుడు కె.రామకృష్ణ అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ జి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

అసంపూర్తి రహదారిలో అవస్థల ప్రయాణం

- ఛిద్రమైన కుయ్యేరు– గొల్లపాలెం రోడ్డు
- వంటా వార్పు, ర్యాలీలతో స్థానికుల నిరసన
- ప్రయాణికుల ఇక్కట్లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అసంపూర్తి నిర్మాణంతో అధ్వానంగా తయారైన గొల్లపాలెం, కుయ్యేరు రోడ్డు



వంటా, వార్పులో భాగంగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న అఖిలపక్షం నాయకులు

కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుయ్యేరు, గొల్లపాలెం రహదారి నిర్మాణంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మండల గ్రామాలకు చెందిన స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన నాయకులు ముఖం చాటెయ్యడంతో మండల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆందోళనలు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.37 కోట్లు మంజూరు

గొల్లపాలెం, కుయ్యేరు రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో మూడేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి రూ.37 కోట్ల నిధులు మంజూరు చేయించింది. అప్పటి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. 13 కిలోమీటర్ల పొడవుగల రోడ్డులో చిన్న కాలువలకు సుమారు 32 కల్వర్టులు నిర్మించి, మొగలిపాలెం జంక్షన్ వద్ద కూరాడ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసారు. గతంలో మూడున్నర మీటర్లు వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును ఏడు మీటర్ల వెడల్పు చేసారు. గొల్లపాలెం, కాజులూరు, చేదువాడ, దుగ్గుదుర్రు తదితర గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. మిగిలిన భాగంలో తారురోడ్డు నిర్మాణంతోపాటు, దుగ్గుదుర్రు, కాజులూరు గ్రామాల మధ్య అండ్రంగి డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం, చెదువాడ వద్ద కోరంగి కెనాల్‌పైనా వంతెన నిర్మాణాలు పూర్తికావలసి ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి.

ఈ మార్గంలో 26 గ్రామాల ప్రజల రాకపోకలు

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలన పూర్తయినప్పటికీ ఇప్పటి వరకూ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టలేదు. ప్రయాణానికి మండల గ్రామాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. రోడ్డు పునర్నిర్మాణానికి ముందు శిథిల రహదారిపై వాహనదారులు అవస్థలు పడుతూ ప్రయాణాలు సాగించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డును తవ్వి, వెడల్పు చెయ్యడంతో దారి పొడవునా పెద్ద గోతులు, గుట్టలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు బయటి ప్రపంచానికి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఇది ప్రధాన రహదారి కావడంతో మండలంలోని 26 గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పనిమీద ఈ రహదారిపై ప్రయాణించక తప్పదు. రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోల నుంచి మండలంలోని పలు గ్రామాలకు ప్రతి రోజూ వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సులను అధికారులు పూర్తిగా నిలుపుదల చేసారు. ఆటో డ్రైవర్లు ఈ రోడ్డుపై బస్సు సర్వీసును నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి చెయ్యాలంటూ పలు పార్టీల నాయకులు జేఏసీగా ఏర్పడి ఆందోళన బాట పట్టారు. పలు మార్లు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించడంతోపాటు వంటా, వార్పుతో నిరసన తెలియజేసారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించకుంటే నిరాహార దీక్షలు చేస్తామంటూ జేఏసీ నాయకులు హెచ్చరిస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డును తవ్వి వేయడంతో పెద్ద గోతులు, గుట్టలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోవడంతో రోడ్డు పరిసర గ్రామాల ప్రజలు బయటి ప్రపంచానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తక్షనం రోడ్డు పనులు ప్రారంభించాలి.

– సలాది నానాజీ, జేఏసీ నాయకుడు, కాజులూరు

75 శాతం పనులు పూర్తి



రోడ్డును వెడల్పు చెయ్యటం, కల్వర్టుల నిర్మాణంతో సార్వత్రిక ఎన్నికల నాటికి 75 శాతం పనులు పూర్తయ్యాయి. అత్యవసరంగా అండ్రంగి డ్రెయన్‌పై వంతెన నిర్మాణం చేపట్టి, తారురోడ్డు నిర్మాణం చేపడితే దాదాపు ప్రయాణీకుల ఇబ్బందులు తీరినట్టే. పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– యాళ్ల సత్తిబాబు, జేఏసీ నాయకుడు, కాజులూరు

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై నిరసన



రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు సంఘం నాయకులు

రామచంద్రపురం: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రామచంద్రపురం వార్డు సచివాలయం ఉద్యోగులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని, 6 సంవత్సరాల ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాతృ శాఖల్లోకి సచివాలయం ఉద్యోగులను విలీనం చేయాలని, పదోన్నతులు ఇవ్వాలని నినాదాలు చేశారు. క్లస్టర్ మ్యాపింగ్ విధానాలను రద్దు చేయాలని కోరారు. పట్టణంలోని 12 సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ నాయకులకు వినతిపత్రాలు

రామచంద్రపురంలో శనివారం జాతీయ నాయకుల విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమం నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోనసీమ జిల్లా అధ్యక్షుడు, సచివాలయం ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ, చైర్మన్ విత్తనాల హరికృష్ణ, వైస్ చైర్మన్లు పడుపులేటి వీరలక్ష్మి, పి.రమారెడ్డి, కన్వీనర్ రుద్రాక్షుల దుర్గాప్రసాద్, కోకన్వీనర్ చోళ్లంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



చోడవరంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ బీవీవీ సత్యనారాయణ



మండపేటలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

రామచంద్రపురం రూరల్: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో శుక్రవారానికి స్వస్థ్ నారీ– స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా 386 వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. మండలంలోని చోడవరంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు వి.లక్ష్మీప్రసన్న, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సునీల్, డివిజనల్ మెడికల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ, ఎంపీటీసీ సాదే సుభద్రమ్మ పాల్గొన్నారు. వెలంపాలెంలో సర్పంచ్ టేకుమూడి సుజాత ఆధ్వర్యంలో ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ నాయుడు, డాక్టర్ రత్న సుధ వైద్య సేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీ ఆరోగ్యంపైనే కుటుంబం అభివృద్ధి

రాయవరం: మహిళల ఆరోగ్యంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని కూర్మాపురం, వెదురుపాక గ్రామాల్లో నిర్వహించిన స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం అంతా శక్తివంతంగా ఉండి అభివృద్ధి చెందుతుందన్నారు. అనుమానిత క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి కాకినాడ జీజీహెచ్‌కు పంపిస్తున్నామన్నారు. జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సునీల్, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, పీహెచ్‌సీ వైద్యులు రమ్యశ్రీ, అనిరుధ్, మణికంఠ, సూపర్‌వైజర్లు ప్రభావతి, అప్పారావుచౌదరి, సత్యవతి, ప్రసాద్, వైట్‌స్టోన్, సిబ్బంది ఉన్నారు.


మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కపిలేశ్వరపురం (మండపేట): మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సూచించారు. మండపేట పట్టణం లాల్‌బహదూర్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన స్వస్థ నారీ, స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైద్యాధికారిణి వి.భవాని మహిళలకు వైద్య పరీక్షలు చేసి సూచనలు చేశారు. నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, ముక్కా దాలియ్య, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఆలమూరు: ప్రపంచాన్ని పట్టి పీడిస్తూ అనేక మంది మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా మహిళలందరూ అవగాహన పెంచుకోవాలని స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ సుమలత అన్నారు. మండలంలోని చెముడులంకలో శుక్రవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో ఆమె పాల్గొన్నారు. ఆహార శైలిలో మార్పుల ద్వారా క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చన్నారు. రాష్ట్రంలో ఏటా 70 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, 40 వేల మంది వరకూ మృతి చెందుతున్నారన్నారు. జిల్లాలో సుమారు మూడు వేల మంది క్యాన్సర్ బాధితులున్నట్లు తెలుస్తోందన్నారు. కాకినాడ జీజీహెచ్ లో వ్యాధి నిర్ధారణకు పీఓయూ 222 గ్రీన్ చానల్ ఓపీ విభాగం మంగళ, గురువారాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. చొప్పెల్ల సీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీ స్నేహలత, బి.అనంత రామకృష్ణ, ఎంపీహెచ్ఈఓ పాల్గొన్నారు.

మహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గాదేవి



ద్రాక్షారామ నున్న వారి వీధిలో దీపోత్సవం



మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన విజయదుర్గ అమ్మవారు



మహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు



మండపేట పెద్దమ్మ ఆలయంలో పృథ్వీరాజ్

రాయవరం: కనకదుర్గాదేవి రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తోంది. వివిధ ఆకారాల్లో అలంకృతులైన అమ్మవారిని వీక్షించేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ఆలయాలకు క్యూ కడుతున్నారు. మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితుల అర్చకత్వంలో విజయదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్ (బాబి), విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెద్దపాటి సత్య కనకదుర్గ, బలిజేపల్లి రమ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సకల శుభాలనిచ్చే శక్తి స్వరూపిణి అయిన విజయదుర్గా అమ్మవారిని కొలిచే వారికి సకల శుభాలు కలుగుతాయని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులకు ఉద్బోధించారు. పీఠంలో ప్రముఖ సాహితీవేత్త ధూళిపాల మహదేవమణి, మైశర్మలు అమ్మవారి విశిష్టతను శరన్నవరాత్రి ప్రాముఖ్యతను వివరించారు.

కుంకుమ పూజలు

రామచంద్రపురం: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని జోడు తూముల వద్ద కనకదుర్గమ్మ మహాలక్ష్మి అలంకరణలో భక్తులను దర్శనమిచ్చారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు.

అమ్మవారికి విశేష పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శుక్రవారం శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అంగర, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు, టేకి, వడ్లమూరు తదితర గ్రామాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. మండపేటలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు, మాజీ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా ఆయనకు ఘన స్వాగతం పలికారు. తణుకు అశోక్, కోనాల చంద్రబోస్, నమశివ, తమ్మ జగదీష్, చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు. 25వ వార్డులోని శ్రీవిజయదుర్గ అమ్మవారిని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి దర్శించుకున్నారు. నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు ఆలయాల్లో 5వ రోజు శుక్రవారం అమ్మవారికి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో అమ్మవారి మట్టి ప్రతిమను శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించి సువర్ణ, రజత పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ద్రాక్షారామలోని వాసవీ కన్యకా పరమేశ్వరిని లక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారపుపేట శ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

అమ్మవారి ఆలయాలకు భక్తుల తాకిడి

కాజులూరు: గ్రామాల్లో శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కాజులూరు దుర్గాదేవి ఆలయంలో అర్చకులు 108 మంది మహిళలతో కలశ పూజ చేయించారు.

దుర్గాదేవి ఆలయం వద్ద దీపోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ నున్న వారి వీధిలో లక్ష్మీ గణపతి ఆలయం వద్ద నెలకొల్పిన దుర్గాదేవి మండపం వద్ద శుక్రవారం ఉదయం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి దీప స్తంభం ఏర్పాటు చేసి దీపోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కె.గంగవరం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులందరూ హాజరుకావాలని ఎంపీడీఓ ఆదేశించారు.

మేధోసంపత్తి హక్కులను పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామారావు

రామచంద్రపురం: ఆవిష్కరణ సృష్టికర్తల హక్కులను పరిరక్షించడం ద్వారా సృజనాత్మకతను, మేధోసంపత్తిని ప్రోత్సహించాలని యూఎన్ఓ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రామారావు అన్నారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు అధ్యక్షతన బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మేధోసంపత్తి, రాజ్యాంగం అనే అంశంపై ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. న్యాయవాద వృత్తి సమాజాన్ని ఒక నిర్మాణాత్మక దిశలో నిర్మించే ఇంజినీరు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు వరాహ నరసింహమూర్తి, ట్రెజరర్ చింతపల్లి శ్రీనివాసు, ఏజిపి లకాని పద్మకమల కుమారి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పిల్లి మురళీ మోహన వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు ఆర్ఆర్‌కేపీ జానకి, డీపీ శాస్త్రి, వై.దుర్గాప్రసాద్, కాకినాడ శ్రీనివాసు పాల్గొన్నారు.

సత్యరిత్విక్‌కు బంగారు పతకం



సత్యరిత్విక్

మామిడికుదురు: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన సూరో భారతి సంగీత్ కళా కేంద్ర 2024–25 సంవత్సరానికి నిర్వహించిన సంగీత పరీక్షల్లో కీ బోర్డు గ్రేడ్–2 పరీక్షల్లో లూటుకుర్రు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుల సత్యరిత్విక్ బంగారు పతకం గెలుచుకున్నాడు. ఇటీవల ఈ పరీక్షలు జరిగాయి. విద్యా పీఠం ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌శర్మ శుక్రవారం రిత్విక్‌కు బంగారు పతకం అందజేశారు. రిత్విక్ ప్రస్తుతం అమలాపురంలో పదో తరగతి చదువుతున్నాడు. ఇందుపల్లి విద్యా పీఠంలో అతను కీ బోర్డు ప్లే చేయడంలో శిక్షణ పొందాడు.

బాధితుడి వైద్యానికి ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. గ్రామానికి చెందిన 43 ఏళ్ల నేకూరి హరిచంద్ర ప్రసాద్ శరీరంపై పుండ్లు పట్టడంతో రెండు చోట్ల ఆపరేషన్ చేయించుకున్నారు. మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో వైద్యులను సంప్రదించగా, ఓ ఆపరేషన్ చేయాలని సూచించారు. ఎలక్ట్రీషియన్‌గా పని చేసే ప్రసాద్ కష్టపడితే కానీ ఇల్లు గడవని పరిస్థితి. వైద్యానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో.. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. కొత్తకాలనీలో బాధితుడి ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు రూ.12 వేల చెక్కును అందజేశారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయవద్దు

మలికిపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రతి కూలీ ఉద్యమించాలని లిబ్‌టెక్ సంస్థ ప్రతినిధి ఎంఎం రాహుల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పూలే–అంబేడ్కర్ భవన్‌లో ఉపాధి హామీపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా ఉపాధి కూలీ సంఘం నాయకుడు ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్త రాహుల్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 30 కోట్ల మంది ఉపాధి కూలీలు ఉన్నారని, ఆధార్ బేస్ పేమెంట్ సిస్టం తప్పనిసరి చేయడం వల్ల 10 కోట్ల మంది కూలీలు తొలగించబడ్డారన్నారు. ఉపాధి హామీ చట్టం పరిశోధకులు బీడీఎస్ కిషోర్ మాట్లాడుతూ, ఉపాధి బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు కేటాయించారన్నారు. ఉపాధి డిమాండ్‌కు తగ్గట్టుగా రూ.మూడు లక్షల కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉందని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం పరంధామయ్య వివరించారు.